జ్వాల
# దశ
నిజం.. నిర్భయంగా..

WWW.DASHANEWS.COM
బుధవారం
10-06-2026
సంపుటి 1 సంచిక 197
పేజీలు : 04
వెల : 1/-
PRGI No : TGTEL/25/A4195


## చరిత్రలో ఈ రోజు...



పోర్చుగల్ జాతీయదినోత్సవం.. సమయపాలనను కచ్చితంగా అమలుజరపటం కోసం జపాన్ లో ఈ రోజున సమయపాలన దినంగా పాటిస్తారు.

1916 : భారత జాతీయ ప్రతిజ్ఞ భారతదేశం నా మాతృభూమి రచయిత పైడిమర్రి వెంకటసుబ్బారావు జననం (మ.1988).

1960 : తెలుగు సినిమా నటుడు, ఏపీ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జననం

1966 : భారత వాయుసేనకు సంబంధించిన రష్యన్ మిగ్ విమానాల తయారీ నాసిక్ లో ప్రారంభమయ్యింది.

1998: ప్రపంచకప్పు ఫుట్‌బాల్ పోటీ

1958 : ప్రముఖ దర్శకుడు ఇ.వి.వి.సత్యనారాయణ జననం (మ.2011)

1938 : భారత పారిశ్రామిక వేత్త రాహుల్ బజాజ్ జననం (మ.2022)

1928 : చీరాల పేరాల ఉద్యమానికి నాయకత్వం వహించిన భారత స్వాతంత్ర్య సమరయోధుడు దుగ్గిరాల గోపాలకృష్ణయ్య మరణం (జ.1889)

# లక్షల టన్నుల మార్క్ దిశగా తెలంగాణ

## వరి సాగు, ధాన్యం కొనుగోళ్లలో దేశానికే ఆదర్శం



**దశ, హైదరాబాద్:** తెలంగాణ వ్యవసాయ రంగంలో మరో చారిత్రాత్మక మైలురాయిని అధిగమించింది. 202526 యాసంగి సీజన్‌లో దేశవ్యాప్తంగా వరి సాగు విస్తీర్ణం, ధాన్యం కొనుగోళ్లలో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచినట్లు ప్రణాళికశాఖ నివేదిక వెల్లడించింది. రికార్డు స్థాయిలో సాగు, భారీ స్థాయిలో కొనుగోళ్లతో రాష్ట్రం దేశానికే అన్నపూర్ణగా మారిందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. సాధారణంగా నీటి కొరత కారణంగా దేశంలోని చాలా రాష్ట్రాల్లో యాసంగి సీజన్‌లో వరి సాగు తగ్గిపోతుంటే.. తెలంగాణలో మాత్రం పూర్తి భిన్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ యాసంగిలో రాష్ట్రవ్యాప్తంగా 59.90 లక్షల ఎకరాల్లో వరి సాగు నమోదై కొత్త రికార్డు సృష్టించింది. దేశవ్యాప్తంగా జరిగిన యాసంగి వరి సాగులో సగానికి పైగా వాటా తెలంగాణదే కావడం విశేషంగా మారింది. పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు లో 30.76 లక్షల ఎకరాలు, ఆంధ్ర ప్రదేశ్ లో 17.29 లక్షల ఎకరాల్లో మాత్రమే వరి సాగు జరగగా.. తెలంగాణ దాదాపు రెట్టింపు స్థాయిలో సాగు నమోదు చేసింది. వానాకాలం, యాసంగి రెండు సీజన్లను కలిపి చూస్తే అత్యధిక వరి సాగు విస్తీర్ణంలో ఉత్తరప్రదేశ్ తొలి స్థానంలో ఉండగా, తెలంగాణ రెండో స్థానాన్ని దక్కించుకుంది. వరి సాగుతో పాటు ధాన్యం కొనుగోళ్లలోనూ తెలంగాణ దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు సాధించింది. శనివారం నాటికి రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు 72.30 లక్షల టన్నులకు చేరుకున్నాయి. మరో వారం రోజుల పాటు కొనుగోళ్లు కొనసాగనున్న నేపథ్యంలో ఈ సంఖ్య 75 లక్షల టన్నుల మార్కును సులభంగా దాటుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇక తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మొత్తం ధాన్యం కొనుగోళ్లు కలిపినా 40 లక్షల టన్నుల లోపే ఉండటం గమనార్హం. దీంతో ప్రభుత్వ కొనుగోలు వ్యవస్థ సామర్థ్యంపై

..మిగతా 4వ పేజీలో →






## జీతాల ఆలస్యంపై
# సీఎం సీరియస్

### ఇక 1వ తేదీకే వేతనాలు తప్పనిసరి



**దశ, హైద్రాబాద్:** రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల జీతాల చెల్లింపులో జరుగుతున్న ఆలస్యాలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉద్యోగులకు సమయానికి వేతనాలు అందకపోవడంపై అధికారులను హెచ్చరిస్తూ, ఇకపై జీతాల విడుదలలో నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు. సీఎం ఆదేశాల మేరకు ఆర్థిక శాఖ కీలక సర్క్యులర్ జారీ చేసింది. రాష్ట్రంలోని రెగ్యులర్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, హానరేరియం ఉద్యోగులందరికీ ప్రతి నెల 1వ తేదీన తప్పనిసరిగా జీతాలు జమ కావాలని పేర్కొంది. వేతనాల చెల్లింపులో ఆలస్యం

..మిగతా 4వ పేజీలో →



### ఆర్&బీ ఈఎన్‌సీ మోహన్ నాయక్ ఇళ్లపై
## ఏసీబీ దాడులు
### రూ.100 కోట్లకు పైగా అక్రమాస్తుల గుర్తింపు?

**దశ, హైదరాబాద్ :** ఏసీబీ రాష్ట్రంలో అవినీతి అధికారులపై ఉక్కుపాదం మోపుతోంది. తాజాగా రాష్ట్ర రోడ్లు & భవనాల శాఖ (R&B) ఇంజినీర్ఇన్ చీఫ్ మోహన్ నాయక్ నివాసాలు, కార్యాలయాలపై ఏసీబీ అధికారులు మంగళవారం తెల్లవారుజాము నుంచే విస్తృత స్థాయిలో సోదాలు నిర్వహిస్తున్నారు. ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణల నేపథ్యంలో చేపట్టిన ఈ దాడుల్లో భారీగా చర, స్థిరాస్తుల పత్రాలు బయటపడినట్లు సమాచారం. ప్రాథమిక అంచనాల ప్రకారం మోహన్ నాయక్‌కు సంబంధించిన అక్రమాస్తుల విలువ రూ.100 కోట్లకు పైగానే ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. మాదాపూర్ లోని ప్రధాన నివాసంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 11 ప్రాంతాల్లో ఏసీబీ బృందాలు ఏకకాలంలో తనిఖీలు నిర్వహిస్తున్నాయి. ఆయనకు చెందిన కార్యాలయాలు, బంధువులు, సన్నిహితుల ఇళ్లలో కూడా సోదాలు కొనసాగుతున్నట్లు తెలిసింది. రోడ్లు, భవనాల శాఖలో కీలక పదవిలో ఉన్న మోహన్ నాయక్‌పై గత కొంతకాలంగా అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ కాంట్రాక్టులు మంజూరు చేసే ప్రక్రియలో భారీ కమీషన్లు వసూలు చేశారనే ఆరోపణలతో పాటు.. కొన్ని ప్రైవేట్ సంస్థలకు అనుకూలంగా టెండర్లు కేటాయించారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న సోదాల్లో బ్యాంకు ఖాతాల వివరాలు, లాకర్ల సమాచారం, విదేశీ పెట్టుబడులకు సంబంధించిన పత్రాలు, ఖరీదైన లగ్జరీ కార్లు, భూములు, విలాసవంతమైన ఇళ్లకు సంబంధించిన డాక్యుమెంట్లను అధికారులు స్వాధీనం చేసుకుని

..మిగతా 4వ పేజీలో →

### నీట్ రీ ఎగ్జామ్‌కు
# కమాండో స్థాయి భద్రత

## లాక్‌డౌన్‌లో ఎక్స్‌పర్ట్స్



**దశ, న్యూఢిల్లీ :** నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించనున్న నీట్ యూజీ2026 రీ ఎగ్జామినేషన్‌కు సంబంధించి ఈసారి అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. గతంలో ప్రశ్నపత్రం లీకేజీ వివాదం తీవ్ర దుమారం రేపిన నేపథ్యంలో.. జూన్ 21న జరగనున్న రీ టెస్ట్‌ను ఎలాంటి లోపాలకు తావులేకుండా నిర్వహించేందుకు "జీరో ఎర్రర్ పాలసీ" అమలు చేస్తోంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. ప్రశ్నపత్రాల తయారీలో పాల్గొంటున్న సబ్జెక్ట్ నిపుణులు, పర్యవేక్షకులు, అనువాదకులతో కూడిన బృందాన్ని ప్రత్యేక భద్రతా వలయంలో లాక్‌డౌన్ చేసినట్లు తెలుస్తోంది. కేంద్ర భద్రతా బలగాల పర్యవేక్షణలో ఉన్న ఈ రహస్య కేంద్రంలో మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌వాచీలు సహా ఎలాంటి కమ్యూనికేషన్ పరికరాలకు అనుమతి లేదని సమాచారం. పరీక్ష పూర్తయ్యే వరకు ఈ బృందం పూర్తిగా బయటి ప్రపంచానికి దూరంగా ఉండనుంది. ముందస్తు అనుమతి పొందిన ప్రత్యేక సిబ్బందికి మాత్రమే ఈ భద్రతా జోన్‌లోకి ప్రవేశం కల్పిస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో ప్రశ్నపత్రాల రవాణా, నిల్వ దశల్లో లీకేజీలు జరిగాయనే ఆరోపణల నేపథ్యంలో ఈసారి ఎన్‌టీఏ మల్టీ లేయర్ సెక్యూరిటీ ఫ్రేమ్‌వర్క్‌ను

..మిగతా 4వ పేజీలో →



# 10 రోజుల్లో అమెరికా వీసా ఇంటర్వ్యూ

### కొత్త ప్రీమియం సేవకు శ్రీకారం

**సాధారణ బి-1/బి-2 వీసా దరఖాస్తు ఫీజు 185 డాలర్లకు**


**అదనంగా 750 డాలర్లు చెల్లిస్తే అభ్యర్థులకు వేగంగా ఇంటర్వ్యూ స్లాట్**

**పైలట్ ప్రాజెక్ట్ జూలై 1డిసెంబర్ 31 వరకు ప్రయోగాత్మకంగా అమలు**

**దరఖాస్తుదారులు దీర్ఘకాలిక వెయిటింగ్ సమస్య**

**దశ, ఆన్లైన్ ప్రతినిధి /న్యూఢిల్లీ :** అమెరికా వీసా అపాయింట్‌మెంట్ల కోసం నెలల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితులకు చెక్ పెట్టేందుకు యునైటెడ్ స్టేట్స్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బి1/బి2 (టూరిస్ట్, బిజినెస్) వీసా దరఖాస్తుదారుల కోసం ప్రత్యేక "ప్రీమియం ఇంటర్వ్యూ సేవ"ను ప్రవేశపెట్టనుంది. ఈ విధానం ద్వారా అదనపు రుసుము చెల్లించే అభ్యర్థులు

..మిగతా 4వ పేజీలో →



## గోదావరిలో విషాదం

### గల్లంతైన ముగ్గురు సోదరుల మృతదేహాల వెలికితీత

**దశ, నిర్మల్ :** బాసర గోదావరి నదిలో మంగళవారం చోటుచేసుకున్న విషాద ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలచివేసింది. జ్ఞాన సరస్వతి అమ్మవారి దర్శనం కోసం హైదరాబాద్ నుంచి వచ్చిన ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు సోదరులు పుణ్యస్నానం చేస్తూ నీటిలో గల్లంతుకాగా, గంటల తరబడి సాగిన గాలింపు చర్యల అనంతరం వారి మృతదేహాలను

..మిగతా 4వ పేజీలో →

## దుబాయ్‌లో విషాదం

### రోడ్డు ప్రమాదంలో తెలంగాణకు చెందిన ముగ్గురు కార్మికులు మృతి

దశ, హైదరాబాద్ : దుబాయ్ లో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తెలంగాణకు చెందిన ముగ్గురు కార్మికులు ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విషాదాన్ని నింపింది. మినీబస్సు, ట్రక్కు ఢీకొన్న ఈ ప్రమాదంలో మొత్తం ఏడుగురు మృతిచెందగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం ప్రకారం.. సోమవారం దుబాయ్‌లో అత్యంత రద్దీగా ఉండే ఎమిరేట్స్ రోడ్డుపై వేగంగా

..మిగతా 4వ పేజీలో →





# సాటర్ డే.. నో బ్యాగ్ డే

**విద్యలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం**

**క్రీడలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న నేపథ్యంలో. క్యాలెండర్‌లోనే ప్రతిరోజూ క్రీడలు, ఆటలు**

**విద్యార్థులకు యోగా లేదా ధ్యానం చేయించటం తప్పనిసరి**

4లో


## పోక్సో నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలి

❖ BJP ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు



**దశ, ఖమ్మం:** పోక్సో కేసు నిందితుడిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని BJP ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం ఖమ్మంలో అత్యాచారానికి గురై ఆసుపత్రిలో వైద్య సేవలు పొందుతున్న బాలికను ఆయన కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖమ్మం జిల్లా, తల్లంపాడు గ్రామానికి చెందిన రెగళ్ళ రమేష్, రేగళ్ళ పార్వతి దంపతుల కూతురైన 12 ఏళ్ల చిన్నారిని, ఖమ్మం రాపర్తి నగర్ లోని G ride అపార్ట్మెంట్లో పని చేసుకుంటున్న వారి తాత, అమ్మమ్మ దగ్గరకు వేసవి సెలవులకు రావడం జరిగిందని, అదే అపార్ట్మెంట్లో 2nd ఫ్లోర్ లో ఉంటున్న 42 ఏళ్ల వయసున్న గౌస్ పాషా ఆ చిన్నారిని అదే అపార్ట్మెంట్ పైకి తీసుకువెళ్లి రెండు చేతులు కట్టివేసి అత్యాచారం చేసి అత్యంత హేయంగా ఇబ్బందులకు గురిచేయడం జరిగిందన్నారు. బయట వారికి తెలుస్తుందని భయంతో, తప్పును దాచి పెట్టే నెపంతో ఆ చిన్నారిని చంపుదామని అపార్ట్మెంట్ పైనుండి కిందికి తోసివేశాడన్నారు. ఆ చిన్నారి ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం అత్యంత విషమంగా ఉందన్నారు. పూర్తిగా లోపల అవయవాలన్నీ కూడా విరిగిపోయాయని తెలిపారు. ఈ నేరానికి పాల్పడిన గౌస్ పాషాపై ఖమ్మం టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేవలం పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు కేసు విచారణలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. నిందితుడికి రక్షణ కల్పించే విధంగా పోలీసులు ప్రవర్తిస్తున్నారన్నారు. ప్రభుత్వం, పోలీస్ శాఖా ఉన్నతాధికారులు స్పందించి నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. భాధితురాలికి న్యాయం జరిగే వరకు పోరాడుతామని, బాలికకు, ఆమె కుటుంబానికి భారతీయ జనతా పార్టీ పూర్తిగా అండగా ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా పదాధికారులు రాష్ట్ర నాయకులు మహిళా మోర్చా నాయకులు, టౌన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దామరచర్లలో విషాదం.. ఎదురెదురుగా బైకులు ఢీకొని ముగ్గురు మృతి




**దశ, దామరచర్ల :** దామరచర్ల లారీ యార్డ్ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం, వాడపల్లికి చెందిన బత్తుల ధనుంజయరావు(43), ఉప్పుతల నరసింహారావు(38) స్థానిక సిమెంట్ ఫ్యాక్టరీకి పనికి వెళ్లేందుకు బైక్‌పై బయలుదేరారు. వారు దామరచర్ల లారీ యార్డ్ వద్దకు చేరుకున్న సమయంలో, దాచేపల్లి మండలం నారాయణపురం గ్రామానికి చెందిన డెక్క వెంకటేశ్(25) మరో బైక్‌పై వేగంగా వచ్చి వారి వాహనాన్ని ఢీకొట్టాడు. ఢీకొన్న ప్రభావంతో ధనుంజయరావు అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన నరసింహారావు, వెంకటేశ్‌లను స్థానికులు వెంటనే మిర్యాలగూడ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ వెంకటేశ్ పరిస్థితి విషమించడంతో ప్రాణాలు కోల్పోయాడు. మరోవైపు, మెరుగైన వైద్యం కోసం నరసింహారావును నల్లగొండకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఒకే ప్రమాదంలో ముగ్గురు మృతిచెందడంతో దామరచర్ల మండలంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు స్థానిక ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.

# రాంగ్ రూట్‌లో వెళ్తే చలానా ఖాయం..





❖ *100 కీలక మార్గాల్లో సీసీ కెమెరాల నిఘా*

**దశ, హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలో రాంగ్‌సైడ్ డ్రైవింగ్‌కు అడ్డుకట్ట వేసేందుకు ట్రాఫిక్ పోలీసులు కఠిన చర్యలకు శ్రీకారం చుట్టారు. "పోలీసులు కనిపించరు కదా" అన్న నిర్లక్ష్యంతో అడ్డదారిలో ప్రయాణిస్తే ఇకపై నేరుగా సీసీ కెమెరాలకు చిక్కి ఈచలానా తప్పదని అధికారులు హెచ్చరిస్తున్నారు.

నగరవ్యాప్తంగా వాహనదారులు తరచూ రాంగ్‌రూట్‌లో ప్రయాణిస్తున్న 200కు పైగా ప్రాంతాలను ట్రాఫిక్ విభాగం గుర్తించింది. వీటిలో అత్యంత రద్దీగా ఉండే 100 ప్రధాన మార్గాల్లో అత్యాధునిక సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ కెమెరాలు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వాహనాలను ఆటోమేటిక్‌గా గుర్తించి కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు సమాచారం పంపనున్నాయి. అనంతరం నేరుగా వాహన యజమానుల మొబైల్‌కు ఈచలానా మెసేజ్ చేరే విధంగా వ్యవస్థను సిద్ధం చేశారు.

త్వరగా గమ్యస్థానానికి చేరుకోవాలనే ఆతృతతో చాలామంది వాహనదారులు రాంగ్‌సైడ్‌ను ఎంచుకుంటున్నారని అధికారులు చెబుతున్నారు. అయితే ఇదే నిర్లక్ష్యం ప్రాణాంతక ప్రమాదాలకు దారితీస్తోంది. ఈ ఏడాది కేవలం ఐదు నెలల్లోనే రాంగ్‌రూట్ ప్రయాణాల కారణంగా 50కి పైగా ప్రమాదాలు నమోదవగా, ఇద్దరు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయినట్లు ట్రాఫిక్ విభాగం వెల్లడించింది. ఉదయం, రాత్రి వేళల్లో రోడ్లు ఖాళీగా ఉంటాయని భావించి చాలామంది అడ్డదారిలో వెళ్తుండగా, పోలీసుల తనిఖీల్లో చిక్కిన తర్వాత "కొద్ది దూరమే కదా", "చుట్టూ తిరగడం ఇబ్బంది" అంటూ సాకులు చెబుతున్నారని అధికారులు తెలిపారు. కొందరు వాహనదారులు పోలీసులతో వాగ్వాదానికి దిగుతూ కేసుల్లో ఇరుక్కుంటున్నారని పేర్కొన్నారు. ట్రాఫిక్ చలానాల నుంచి తప్పించుకోవడానికి కొందరు నంబర్ ప్లేట్లు తొలగించడం, మార్చడం వంటి అక్రమాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. కేవలం ఒక నెల వ్యవధిలోనే 30 ప్రాంతాల్లో రాంగ్‌సైడ్ డ్రైవింగ్‌పై రెండు లక్షలకు పైగా ఈచలానాలు నమోదు కావడం పరిస్థితి తీవ్రతను స్పష్టం చేస్తోంది.

ట్రాఫిక్ సమస్యలు అధికంగా ఉన్న ప్రాంతాలుగా బంజారా హిల్స్ , టోలిచౌకి , మెహదీపట్నం , చార్మినార్ , ఖైరతాబాద్ , పంజాగుట్ట , అమీర్పేట్ , సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ , కాచిగూడ , సుల్తాన్ బజార్ తదితర ప్రాంతాలను ట్రాఫిక్ పోలీసులు గుర్తించారు.

అడ్డదారిలో ప్రయాణించడం వల్ల కేవలం చలానాలు మాత్రమే కాదు.. ప్రాణాపాయ పరిస్థితులు కూడా తలెత్తే అవకాశం ఉందని, వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పోలీసులు సూచిస్తున్నారు.

## రామంతాపూర్లో దోపిడీ ముఠా అరెస్ట్

❖ *నలుగురు రిమాండ్కు, బాలుడు సీసీఎల్ హోంకు తరలింపు*

**దశ, మేడ్చల్:** ఉప్పల్ పిఎస్ పరిధిలోని రామంతాపూర్లో దోపిడీలకు పాల్పడుతున్న ఐదుగురు సభ్యుల ముఠాను ఉప్పల్ పోలీసులు అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.4,000 నగదు, నేరానికి ఉపయోగించిన యాక్టివా ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. జూన్ 7 అర్ధరాత్రి 1 గంట సమయంలో (తెల్లవారితే జూన్ 8) లక్ష్మీనారాయణ కాలనీకి చెందిన చంద్రశేఖర్ తన స్నేహితులతో కలిసి పెట్రోల్ కోసం వెళ్తుండగా మోడ్రన్ బేకరీ సమీపంలో నిందితులు దాడి చేసి శివకాంత్ వద్ద ఉన్న రూ.4,000 నగదును లాక్కొని పరారయ్యారు. ఈ ఘటనలో చంద్రశేఖర్ తలకు గాయమైంది. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఉప్పల్ పోలీసులు దర్యాప్తు చేపట్టి రామంతాపూర్ డీమార్ట్ సమీపంలో నిందితులను పట్టుకున్నారు. విచారణలో రాత్రివేళ ఒంటరిగా వెళ్లే వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని దోపిడీలకు పాల్పడుతున్నట్లు తేలింది. అరెస్టైన నలుగురు నిందితులను కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు. కేసులో ఉన్న బాలుడిని సీసీఎల్ హోంకు తరలించారు. ఈ కేసును త్వరితగతిన ఛేదించిన పోలీసు బృందాన్ని అధికారులు అభినందించారు.




## కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ విమర్శలు

**దశ, హైదరాబాద్:** బీజేపీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూర నర్సయ్య గౌడ్ కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికల ముందు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి తనను తాను "హిట్లర్"గా అభివర్ణించుకోవడం బాధాకరమని, ప్రజాస్వామ్యంలో ఇలాంటి వ్యాఖ్యలు తగవని అన్నారు. తెలంగాణలో జీఎస్టీ వసూళ్లు తగ్గి రాష్ట్రం ఏడో స్థానం నుంచి తొమ్మిదో స్థానానికి పడిపోయిందని తెలిపారు. రీజినల్ రింగ్ రోడ్, మెట్రో, రైల్వే ప్రాజెక్టులకు కేంద్రం సిద్ధంగా ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ కూడా చేయలేకపోతోందని విమర్శించారు. తెలంగాణ రైతుల నుంచి భారీగా ధాన్యం కొనుగోలు చేస్తున్న మోదీ ప్రభుత్వ సహకారాన్ని కాంగ్రెస్ గుర్తించడంలేదన్నారు. తెలంగాణ అభివృద్ధిపై కాంగ్రెస్ నాయకులు ఎప్పుడైనా బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరిన బూర నర్సయ్య గౌడ్, మోదీ పాలనలో తెలంగాణకు జాతీయ రహదారులు, ఎయిమ్స్ వంటి కీలక ప్రాజెక్టులు వచ్చాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలు గమనిస్తున్నారని, సమయం వచ్చినప్పుడు తగిన తీర్పు ఇస్తారని హెచ్చరించారు.



## దేవరకొండ సీఐ కార్యాలయంలో ఎస్పీ ఆకస్మిక తనిఖీ

❖ సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచన

**దశ, దేవరకొండ:** దేవరకొండలోని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాన్ని నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో నిర్వహిస్తున్న రికార్డులు, కేసుల దర్యాప్తు పురోగతిని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా గ్రేవ్ కేసులు, పెండింగ్‌లో ఉన్న దర్యాప్తు ఫైళ్లు, కోర్టు కేసుల వివరాలను ఎస్పీ సమీక్షించారు.

హత్యలు, దోపిడీలు, మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలకు సంబంధించిన కేసుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన ఛేదించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి కేసులో పటిష్టమైన సాక్ష్యాధారాలు సేకరించి నిందితులకు శిక్షలు పడేలా దర్యాప్తు చేపట్టాలని సూచించారు.

### సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి

ప్రస్తుతం సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో వాటి దర్యాప్తును మరింత వేగవంతం చేయాలని ఎస్పీ సూచించారు. సీసీటీఎన్ఎస్‌లో కేసుల నమోదు, డిజిటల్ రికార్డుల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని చెప్పారు. కోర్టు డిస్పోజల్ కేసులు, పెండింగ్ వారెంట్ల అమలు తీరును కూడా సమీక్షించారు. కార్యాలయంలో రికార్డుల నిర్వహణ సంతృప్తికరంగా ఉందని ఎస్పీ పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని హెచ్చరించారు. పోలీసులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. ప్రజల్లో పోలీసు శాఖపై మరింత విశ్వాసం పెరిగేలా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని కోరారు. నేర నియంత్రణ, ప్రజల భద్రతే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ శరత్ చంద్ర పవార్ సూచించారు.

## అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

❖ *కలెక్టర్ బడుగు చంద్రశేఖర్*

**దశ, హాలియా:** హాలియా మండలంలో కొనసాగుతున్న ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బడుగు చంద్రశేఖర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం హాలియాలో పర్యటించిన ఆయన పలు అభివృద్ధి పనులను పరిశీలించి పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా నిర్మాణంలో ఉన్న 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన కలెక్టర్, ఆసుపత్రి ప్రారంభానికి అవసరమైన అన్ని పనులను నెలరోజుల్లో పూర్తి చేయాలని జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి మాతృనాయక్‌కు సూచించారు. ఆసుపత్రికి అవసరమైన ఆధునిక వైద్య పరికరాల కొనుగోలుకు సంబంధించిన ప్రతిపాదనలను వెంటనే సిద్ధం చేయాలని, వాటి కోసం అవసరమైన నిధులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండి ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. అనంతరం హాలియా మున్సిపాలిటీలో అమృత్ పథకం కింద రూ.15 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న నూతన నీటి ట్యాంకుల పనులను పరిశీలించారు. పట్టణంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించేలా పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. గత కొంతకాలంగా నిర్మాణ పనులు నిలిచిపోయిన నేపథ్యంలో సంబంధిత కాంట్రాక్టర్‌తో సమావేశమై పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ రాజా రమేష్, కమిషనర్ రవీందర్ రెడ్డి, మండల వైద్యాధికారి రామకృష్ణ, మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.







## జీలుగు పంటల సాగుతో భూసారం పెరుగుతుంది

**దశ, పినపాక:** జీలుగు పంటల సాగుతో భూసారం పెరుగుతుందని అగ్రికల్చర్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు అన్నారు. పినపాక మండలం ఉప్పాక గ్రామంలో, నిర్వహించిన రైతు సమావేశంలో పినపాక వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. జీలుగు పంటలను సాగు చేయడం వల్ల భూసారం పెరగడంతో పాటు నేలలో సేంద్రియ పదార్థాల శాతం మెరుగుపడుతుందని తెలిపారు. పంటల మార్పిడి విధానంలో జీలుగు పంటలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా దిగుబడులు పెంచుకోవచ్చని సూచించారు. రైతులు శాస్త్రీయ పద్ధతులను అనుసరిస్తూ వ్యవసాయం చేయాలని, వ్యవసాయ శాఖ అందిస్తున్న సలహాలు, సేవలను సద్వినియోగం చేసుకోవాలని వెంకటేశ్వర్లు కోరారు. సమావేశంలో గ్రామ రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## దేశ రక్షణ విభాగం అగ్నీ వీర్‌లో ఇద్దరు గిరిజన విద్యార్థులు ఎంపిక





**దశ, అశ్వాపురం:** అశ్వాపురం మండలం మిట్టగూడెం తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర డిగ్రీ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఇటీవల వెలబడిన అగ్నివీరు ఫలితాల్లో స్థానం సాధించారు. 1) బి.జనార్ధన్ MPCS, 2) సాంబశివరావు EPP గ్రూపు నుండి ఇద్దరు గిరిజన విద్యార్థులు భారత దేశరక్షణ రంగంలో సేవలు అందించడానికి ఎంపిక అయ్యారు. అగ్నివీర్‌కు ఇద్దరు గిరిజన విద్యార్థులు ఎంపికవ్వడంతో భద్రాద్రి జిల్లా ప్రజల్లో హర్షం వ్యక్తం అవుతుంది. విద్యార్థుల ఎంపికపై గురుకుల బాలుర డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బండారుపల్లి రవి అభినందనలు తెలిపారు. వీరి ఎంపికపై పినపాక నియోజకవర్గ వ్యాప్తంగా యువత ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## పసితనంపై పాశవిక దాడి

**దశ, ఖమ్మం:** ఆడబిడ్డల భద్రతపై సమాజం మరోసారి తలదించుకునేలా చేసిన దారుణ ఘటన ఖమ్మం నగరంలో వెలుగుచూసింది. ఇంకా బాల్యాన్ని కూడా పూర్తిగా ఆస్వాదించని 12 ఏళ్ల పసి బాలికపై ఓ కామాంధుడు పాశవికంగా విరుచుకుపడ్డాడు. అత్యాచారానికి పాల్పడటమే కాకుండా తన నేరాన్ని దాచిపెట్టేందుకు భవనం పై నుంచి తోసివేసిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఈ సంఘటనతో బాధిత కుటుంబం కన్నీరుమున్నీరవుతుండగా, నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. ఖమ్మం నగరంలోని రాపర్తినగర్ ప్రాంతంలో నివాసముంటున్న 12 ఏళ్ల మైనర్ బాలికపై లారీ డ్రైవర్ గౌస్ అనే వ్యక్తి అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం బాలికను భవనం 3 వ అంతస్తు నుంచి కిందకు తోసివేయటంతో బాలిక కాళ్లు, వెన్నెముక సమీప భాగాలు, తలకు తీవ్ర గాయాలయ్యాయి. తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలో ఉన్న బాలికను వెంటనే ఆసుపత్రికి తరలించి అత్యవసర చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం బాలిక పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.
ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడు గౌస్‌పై ఖమ్మం టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు తెలిసింది. ఘటనకు సంబంధించిన అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

# ప్రభుత్వ భూములు గుర్తింపు వేగవంతం చేయాలి





- పేదలకు ఇళ్ల స్థలాలు అందించడమే లక్ష్యం
- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**దశ, సత్తుపల్లి:** వేశ్యకాంతుల చెరువు ప్రాంతంలో ప్రభుత్వ భూముల గుర్తింపునకు యుద్ధ ప్రాతిపదికన సర్వే చేపట్టాలని రాష్ట్ర రెవిన్యూ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం సత్తుపల్లి పట్టణంలోని వేశ్యకాంతుల చెరువు ప్రాంతాన్ని తెలంగాణ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డా.మట్టా దయానంద్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సత్తుపల్లి తహసీల్దార్‌తో పాటు రెవెన్యూ శాఖ అధికారులకు ప్రభుత్వ భూములను గుర్తించేందుకు సమగ్ర సర్వేను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ భూముల హద్దులను స్పష్టంగా గుర్తించి నివేదిక సమర్పించాలని సూచించారు. భూమిలేని పేద కుటుంబాలకు ఇళ్ల స్థలాలు అందించాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. వేశ్యకాంతుల చెరువు పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించి, అర్హులైన పేదలకు అందించే దిశగా చర్యలు వేగవంతం చేస్తున్నామన్నారు. ప్రజల సంక్షేమమే మా ప్రభుత్వ ధ్యేయం అని అన్నారు. పేదలకు సొంత ఇంటి కలను సాకారం చేయడానికి అవసరమైన ప్రతి చర్యను తీసుకుంటామన్నారు. సర్వే పూర్తయిన అనంతరం ప్రభుత్వ భూముల వివరాలను పరిశీలించి తదుపరి చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ రిహానా బేగం కమల్ పాషా, సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాదె చెన్నారావు, మున్సిపల్ కౌన్సిలర్లు, రెవిన్యూ అధికారులు, రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## రైతులకు మరింత చేరువగా సహకార బ్యాంకింగ్

- మంత్రులు పొంగులేటి, తుమ్మల

**దశ, పాలేరు:** కరుణగిరి, చెరువు మాదారం నూతన డిసిసిబి శాఖల ప్రారంభం రైతులు, స్వయం సహాయక సంఘాలు, గ్రామీణ ప్రజలకు బ్యాంకింగ్ సేవలను మరింత సులభంగా అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యం. పాలేరు నియోజకవర్గ పరిధిలోని ఏదులాపురం మున్సిపాలిటీ పరిధి కరుణగిరి డిసిసిబి శాఖను, వరంగల్ క్రాస్ రోడ్డులో, నేలకొండపల్లి మండలం చెరువు మాదారం డిసిసిబి శాఖను చెరువు మాదారం గ్రామంలో సహచర మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డితో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సంయుక్తంగా ప్రారంభించడం జరిగింది.

ప్రైవేట్, కమర్షియల్ బ్యాంకులతో పోటీగా డీసీసీబీ శాఖలు ఆధునిక ఆర్థిక సేవలు అందిస్తున్నాయని తెలపడానికి హర్షం వ్యక్తం చేస్తున్నాను. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు గారు, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ గారు ,సీపీ సునీల్ దత్ గారు, స్థానిక ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## వర్తక సంఘం అండగా రాజేష్ కుటుంబానికి ఆర్థిక సాయం



**దశ, పినపాక:** పినపాక మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన పులపగిరి రాజేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన కుటుంబానికి బయ్యారం క్రాస్ రోడ్ వర్తక సంఘం అండగా నిలిచింది. వర్తక సంఘం అధ్యక్షుడు గుండు సురేష్ ఆధ్వర్యంలో సంఘ సభ్యులు రూ.10,000 నగదు ఆర్థిక సహాయంతో పాటు 25 కేజీల బియ్యాన్ని రాజేష్ భార్య దేవకికి స్థానిక సర్పంచ్ అనిత చేతుల మీదుగా అందజేశారు. ఇటీవలే భర్తను కోల్పోవడం, కుమారుడు దివ్యాంగుడు కావడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబానికి మానవతా దృక్పథంతో ఈ సహాయం అందించినట్లు వర్తక సంఘం ప్రతినిధులు తెలిపారు. భవిష్యత్తులో కూడా అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వర్తక సంఘం సభ్యులు కమలాకర్, సలహాదారులు వెన్న భాస్కర్ రెడ్డి, ట్రెజరర్ వెలదండి లక్ష్మణరావు, గంజాయి మురళి, మోహన్‌రావు, డాక్టర్ రాంబాబు, జాడి మహేష్, వేణుగోపాల చారి, గోల్డ్ షాప్ లక్ష్మణ్ చారి తదితరులు పాల్గొన్నారు.

# బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన నిందితుడికి కఠిన శిక్ష విధించాలి

- ఖమ్మం బాలికపై అత్యంత దారుణ లైంగీక దాడి ఘటనను సీపీఎం తీవ్రంగా ఖండిస్తుంది
- నిందితుడిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలి.
- బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలి
- సీపీఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు



**ఖమ్మం, దశ:** ఖమ్మం నగరంలో 12 సంవత్సరాల బాలికపై జరిగిన అత్యంత అమానుషమైన లైంగిక దాడి ఘటనను సీపీఎం ఖమ్మం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తోందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పేర్కొన్నారు. బాధిత బాలికను మంగళవారం పరామర్శించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, బాలికపై లైంగిక దాడికి పాల్పడటమే కాకుండా, ఆధారాలు లేకుండా చేయాలనే దురుద్దేశంతో నాలుగు అంతస్తుల భవనం పైనుంచి కిందకు తోసి వేయడం సభ్య సమాజం తలదించుకునే అత్యంత ఘోరమైన నేరమని అన్నారు. మహిళలు, బాలికలపై రోజురోజుకు పెరుగుతున్న లైంగిక దాడులు ఆందోళన కలిగిస్తున్నాయని, చట్టాల పట్ల నేరస్తులకు భయం లేకపోవడమే ఇలాంటి ఘటనలకు కారణ మవుతోందని అన్నారు. ప్రభుత్వం మహిళల భద్రత విషయంలో మాటలకే పరిమితం కాకుండా కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఈ ఘటనలో నిందితుడిని వెంటనే అరెస్టు చేసి ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరిపి అత్యంత కఠిన శిక్ష విధించాలని కోరారు. బాధిత బాలికకు మెరుగైన వైద్య చికిత్సను పూర్తిగా ప్రభుత్వ ఖర్చులతో అందించడంతో పాటు, బాధిత కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యురాలు బుగ్గవీటి సరళ మాట్లాడుతూ బాలికలపై, మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని, నేరస్తులపై ఉదాహరణాత్మక శిక్షలు అమలు చేయాలని కోరారు. బాధిత కుటుంబానికి సీపీఎం సంపూర్ణ సంఘీభావం ప్రకటిస్తోందని, న్యాయం జరిగే వరకు అండగా ఉంటుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రం, జిల్లా కమిటీ సభ్యులు ఎస్ నవీన్ రెడ్డి, దొంగల తిరుపతిరావు, నగర నాయకులు పత్తిపాక నాగ సులోచన, భాగం అజిత, కూచిపూడి నరేష్, బీబీ, కుమారి, సుజిత, పావని సమీనా తదితరులు పాల్గొన్నారు.

## సమ్మర్ కోచింగ్ శిబిరాన్ని వినియోగించుకోండి



- జిల్లా క్రీడల అధికారి పరంధామరెడ్డి

**దశ, పాల్వంచ:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రీడ ప్రాధికార సంస్థ డిస్టిక్ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో పాల్వంచ మండలం శ్రీనివాస్ కాలనీ జిల్లా క్రీడ మైనాదంలో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని జిల్లా క్రీడల అధికారి పరంధామరెడ్డి సందర్శించి క్రీడాకారులకు ఉద్దేశించి ప్రసంగించారు. బాల బాలికలకు సమ్మర్ క్యాంపులో నిర్వహించడం వలన చెడు వ్యసనాలు దూరంగా ఉంటు క్రీడలు పట్ల మక్కువ పెంచుకుంటే వారి నైపుణ్యంతో మానసిక శారీరక దృఢత్వం ఆలోచన విధానం మార్పు చెందుతూ సమాజంలో క్రమశిక్షణ గల బాధ్యతగా క్రీడలు ఎంతో దోహదపడతాయని అలానే. గ్రామీణ ప్రాంతంలో నివసించే ఎంతోమంది క్రీడాకారులకు ఈ సమ్మర్ క్యాంపులు ఎంతో ఉపయోగపడతాయని వారి ప్రతిభను గుర్తించి రాష్ట్ర జాతియ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దడానికి ఎంతో శ్రమిస్తు కృషి చేస్తున్న కోచ్లు వారి శ్రమకు ఫలితంగా శిక్షణ పొందుతున్న ప్రతి ఒక్క క్రీడాకారులు ఉత్తమ జాతీయ స్థాయి పథకాలను సాధించాలని మనస్పూర్తిగా కోరుకుంటున్నాము. ఈ కార్యక్రమంలో 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి, GSS రాష్ట్ర యువజన నాయకులు అరేం ప్రశాంత్, పాల్వంచ టౌన్ సిఐ సతీష్ కుమార్, జిల్లా అథ్లెటిక్స్ కార్యదర్శి మహేందర్, జిల్లా స్పోర్ట్స్ అధ్యక్షులు డాక్టర్ యుగేందర్ రెడ్డి, వై వెంకటేశ్వర్లు, సమ్మర్ క్యాంప్ కోచ్లు, అథ్లెటిక్స్ కోచ్ నాగేంద్ర, ఆర్చరీ కోచ్ కళ్యాణ్, టెన్నిస్ కోచ్ డేనియల్ రాంబాబు, GSS రాష్ట్ర నాయకులు అరెం ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# 10 రోజుల్లో అమెరికా వీసా ఇంటర్వ్యూ

**మొదటి పేజీ తరువాయి**

కేవలం 10 రోజుల్లోనే వీసా ఇంటర్వ్యూ స్లాట్ పొందే అవకాశం కల్పించనున్నారు. యునైటెడ్ స్టేట్స్ డిపార్ట్మెంట్ అఫ్ స్టేట్ వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈ పైలట్ ప్రాజెక్ట్ 2026 జూలై 1 నుంచి అమల్లోకి రానుంది. ప్రారంభ దశలో ఆరు నెలల పాటు అంటే డిసెంబర్ 31, 2026 వరకు ఈ సేవను ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నారు. అనంతరం స్పందన, నిర్వహణ సామర్థ్యం, ప్రభావం ఆధారంగా దీన్ని శాశ్వతంగా కొనసాగించాలా లేదా అన్న దానిపై నిర్ణయం తీసుకోనున్నారు.ఈ కొత్త విధానం ప్రకారం.. సాధారణ బి1/బి2 వీసా దరఖాస్తు ఫీజు 185 డాలర్లకు అదనంగా 750 డాలర్లు చెల్లిస్తే అభ్యర్థులకు వేగవంతమైన ఇంటర్వ్యూ స్లాట్ కేటాయించనున్నారు. దీంతో మొత్తం వీసా దరఖాస్తు ఖర్చు 935 డాలర్లకు చేరనుంది. అయితే అధికారులు ఒక కీలక స్పష్టీకరణ ఇచ్చారు. ఈ అదనపు రుసుము కేవలం ఇంటర్వ్యూ తేదీని త్వరగా పొందేందుకు మాత్రమే ఉపయోగపడుతుందని, వీసా మంజూరుకు ఎలాంటి హామీ కాదని తెలిపారు. వీసా అర్హత నిబంధనలు, భద్రతా పరిశీలనలు, స్క్రూటినీ ప్రక్రియ యథావిధిగా కొనసాగుతాయని స్పష్టం చేశారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో అమెరికా విజిటర్ వీసా ఇంటర్వ్యూల కోసం ఏడాది వరకు వేచి చూడాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ముఖ్యంగా భారతీయ దరఖాస్తుదారులు దీర్ఘకాలిక వెయిటింగ్ సమస్యను తీవ్రంగా ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో అత్యవసర వ్యాపార ప్రయాణాలు, పర్యాటక అవసరాలు, కుటుంబ కారణాల కోసం త్వరగా అమెరికా వెళ్లాల్సిన వారికి ఈ కొత్త సేవ ప్రయోజనకరంగా మారనుంది.ఇక 2026లో జరగనున్న ఫిఫా వరల్డ్ కప్ 2026, అలాగే 2028లో లోడ్ అంగెల్స్ 2028 ఒలింపిక్ గేమ్స్ నేపథ్యంలో అమెరికా విజిటర్ వీసాల డిమాండ్ భారీగా పెరిగే అవకాశం ఉండటంతో ముందస్తు ప్రణాళికలో భాగంగానే ఈ చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. మరోవైపు, వైద్య అత్యవసరాలు లేదా మానవీయ కారణాల కోసం ప్రస్తుతం అమల్లో ఉన్న "ఎమర్జెన్సీ ఎక్స్‌పెడైట్ అపాయింట్‌మెంట్" విధానం యథాతథంగా కొనసాగుతుందని స్పష్టం చేశారు. కొత్త ప్రీమియం సేవ దానికి ప్రత్యామ్నాయం కాదని, ఇది కేవలం అదనపు సదుపాయం మాత్రమేనని పేర్కొన్నారు.



# స్నేహితుల ప్రాణాల కోసం ప్రాణత్యాగం చేసిన అనురూప్..

**దశ, హైదరాబాద్ :** అమెరికాలో ముగ్గురు స్నేహితుల ప్రాణాలను కాపాడే క్రమంలో ప్రాణత్యాగం చేసిన తెలంగాణ యువకుడు అనురూప్ రెడ్డి భౌతికకాయం మంగళవారం స్వగ్రామమైన కావడి పల్లి కు చేరుకోవడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. యువకుడి అంతిమయాత్రలో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కన్నీరుమున్నీరయ్యారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి ఎక్స్ వేదికగా అనురూప్ రెడ్డికి భావోద్వేగ నివాళులు అర్పించారు. "తోటివారి ప్రాణాల కోసం తన ప్రాణాన్ని సైతం లెక్కచేయని అనురూప్ ధైర్యసాహసాలు చిరస్మరణీయం. అతని అకాల మరణం తీవ్రంగా కలచివేసింది" అని సీఎం పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపుర్మెట్ మండలం కవాడిపల్లికి చెందిన అనురూప్ రెడ్డి(23) అమెరికాలోని లూసియానా లో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ ఏడాది మే 29న తన ముగ్గురు స్నేహితులతో కలిసి టోరో బేయు పార్క్‌కు వెళ్లిన సమయంలో, వారు ప్రమాదవశాత్తూ నీటిలో మునిగిపోతుండగా వారిని కాపాడేందుకు నీటిలోకి దూకాడు. ముగ్గురినీ సురక్షితంగా బయటకు తీసుకొచ్చినా.. అనురూప్ మాత్రం తిరిగి బయటకు రాలేక ప్రాణాలు కోల్పోయాడు. తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని అనురూప్ రెడ్డి భౌతికకాయాన్ని స్వదేశానికి రప్పించింది. సీఎం ఆదేశాలతో ఎంపీ ఛామల కిరణ్ కుమార్ రెడ్డి , ఎమ్మెల్యేలు మల్రెడ్డి రంగారెడ్డి , మందుల శామ్యూల్ కవాడిపల్లికి చేరుకుని నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సీఎం పంపిన సానుభూతి లేఖను అందజేశారు. అనురూప్ చేసిన సాహసాన్ని గుర్తిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అవార్డు, ఆర్థిక సాయం అందించనున్నట్లు కాంగ్రెస్ నేతలు ప్రకటించారు.

## నీట్ రీ ఎగ్జామ్‌కు

# కమాండో స్థాయి భద్రత

**మొదటి పేజీ తరువాయి**

అమలు చేస్తోంది. పేపర్ ప్రింటింగ్, ప్యాకేజింగ్, స్టోరేజ్ నుంచి పరీక్షా కేంద్రాలకు తరలింపు వరకు ప్రతి దశలోనూ బహుళ స్థాయి నిఘా కొనసాగనుంది. అత్యంత కీలకంగా.. ప్రశ్నపత్రాల రవాణా కోసం ఈసారి ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ప్రత్యేక విమానాలను వినియోగిస్తున్నట్లు సమాచారం. దీంతో ప్రైవేట్ రవాణా వ్యవస్థల జోక్యం తగ్గి.. ప్రశ్నపత్రాలు మరింత భద్రంగా గమ్యస్థానాలకు చేరే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా.. నీట్ రీ ఎగ్జామ్ పేపర్ కూడా లీక్ అయిందంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతుండటంపై ఎన్‌టీఏ తీవ్రంగా స్పందించింది. ఇవన్నీ పూర్తిగా అవాస్తవాలు, మోసపూరిత ప్రచారమని స్పష్టం చేసింది. విద్యార్థులు, తల్లిదండ్రులు సోషల్ మీడియాలో వచ్చే పుకార్లను నమ్మవద్దని, అధికారిక వెబ్‌సైట్‌లో ఇచ్చే సమాచారాన్నే విశ్వసించాలని సూచించింది. ఫేక్ ప్రచారం చేస్తున్న సోషల్ మీడియా ఖాతాలపై సైబర్ క్రైమ్ విభాగం సహాయంతో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. కాగా, మే 3న దేశవ్యాప్తంగా




నిర్వహించిన నీట్ పరీక్షలో ప్రశ్నపత్రం లీకేజీ ఆరోపణలు రావడంతో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ మే 12న ఆ పరీక్షను రద్దు చేసింది. అనంతరం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం జూన్ 21న దేశంలోని 551 గరాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5:15 గంటల వరకు రీ ఎగ్జామినేషన్ నిర్వహించనుంది. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న ఈ పరీక్షను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు కేంద్ర విద్యాశాఖ, ఎన్‌టీఏ పూర్తి స్థాయిలో సిద్ధమయ్యాయి.

# జీతాల ఆలస్యంపై సీఎం సీరియస్

**మొదటి పేజీ తరువాయి**

జరిగితే సంబంధిత హెడ్ ఆఫ్ డిపార్ట్‌మెంట్‌లు, డీడీఓలపై బాధ్యత నిర్ణయించి క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ప్రతి నెల 25వ తేదీకి ముందే జీతాల బిల్లులను ట్రెజరీకి సమర్పించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. అలాగే నెలాఖరులోపు స్క్రూటినీ, ఆడిట్, అథరైజేషన్ ప్రక్రియలను పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. బడ్జెట్ కొరతలు లేదా సాంకేతిక సమస్యలు ఎదురైతే ముందుగానే ఫైనాన్స్ శాఖ దృష్టికి తీసుకురావాలని సూచించారు. పరిపాలనా నిర్లక్ష్యం కారణంగా ఉద్యోగులు ఇబ్బందులు పడకుండా అన్ని శాఖలు అప్రమత్తంగా వ్యవహరించాలని సీఎం ఆదేశించారు. కార్పొరేషన్లు, విశ్వవిద్యాలయాలు, సొసైటీలు సహా అన్ని ప్రభుత్వ సంస్థలు ఈ ఉత్తర్వులను కచ్చితంగా అమలు చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రతి ఉద్యోగికి ప్రతి నెల మొదటి తేదీకే వేతనం అందేలా ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని సూచించింది. ఈ మొత్తం ప్రక్రియ పర్యవేక్షణ బాధ్యతలను ఆర్థిక శాఖ కార్యదర్శి డా. గౌరవ్ ఉప్పల్‌కు ప్రభుత్వం అప్పగించింది.

## ఆర్&బీ ఈఎన్‌సీ మోహన్ నాయక్ ఇళ్లపై

# ఏసీబీ దాడులు

**మొదటి పేజీ తరువాయి**

పరిశీలిస్తున్నారు. కాంట్రాక్టర్లతో జరిగిన ఆర్థిక లావాదేవీల రికార్డులను కూడా ప్రత్యేకంగా విశ్లేషిస్తున్నట్లు సమాచారం. పెద్ద ఎత్తున ఆస్తుల వివరాలు వెలుగులోకి వస్తుండటంతో మొత్తం ఆస్తుల విలువను అంచనా వేయడానికి మరింత సమయం పట్టే అవకాశముందని దర్యాప్తు అధికారులు వెల్లడించారు. ఈ కేసు రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది.

# లక్షల టన్నుల మార్క్ దిశగా తెలంగాణ

**మొదటి పేజీ తరువాయి**

తెలంగాణ మరోసారి తన ప్రత్యేకతను చాటుకుంది. ఈ స్థాయిలో దిగుబడులు, కొనుగోళ్లు సాధ్యమవడానికి రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న ప్రోత్సాహకాలు ప్రధాన కారణమని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. ప్రాజెక్టుల ద్వారా నిరంతర సాగునీటి లభ్యత, ఉచిత విద్యుత్, రైతుభరోసా పథకం, సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 అదనపు బోనస్, గ్రామస్థాయిలో పకడ్బందీగా నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాలు రైతులను మరింతగా వరి సాగు వైపు ఆకర్షించాయని విశ్లేషిస్తున్నారు. గణాంకాల ప్రకారం ఈ ఏడాది వానాకాలంలో 69.90 లక్షల ఎకరాలు, యాసంగిలో 59.90 లక్షల ఎకరాలు కలిపి మొత్తం 129.80 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగింది. ఈ రెండు సీజన్ల ద్వారా రాష్ట్రంలో సుమారు 282 లక్షల టన్నుల భారీ ధాన్యం దిగుబడి వచ్చినట్లు పౌరసరఫరాల శాఖ వర్గాలు వెల్లడించాయి. వ్యవసాయానికి ప్రభుత్వం అందిస్తున్న ప్రాధాన్యం, రైతులకు అందుతున్న భరోసా వల్లే తెలంగాణ దేశ వ్యవసాయ రంగంలో కొత్త ప్రమాణాలు సృష్టిస్తోందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## దుబాయ్‌లో

# విషాదం

**మొదటి పేజీ తరువాయి**

వెళ్తున్న మినీబస్సు అదుపుతప్పి ట్రక్కును ఢీకొట్టింది. ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండటంతో బస్సులో ప్రయాణిస్తున్న పలువురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు, అత్యవసర సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంలో మృతిచెందిన వారిలో జగిత్యాల జిల్లాలోని మెట్‌పల్లి మండలానికి చెందిన అబ్దుల్ రఫీక్, కొడిమ్యాల మండలానికి చెందిన సయ్యద్ సలీం, మల్యాల మండలానికి చెందిన గజుల తిరుపతి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీరి మృతితో కుటుంబ సభ్యులు, స్వగ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రమాదంలో గాయపడిన వారిలో హైదరాబాద్ కు చెందిన మహమ్మద్ సయీద్ కూడా ఉన్నాడు. క్షతగాత్రులను సమీప ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతులు, గాయపడిన వారంతా షార్జా కేంద్రంగా పనిచేస్తున్న అల్యూమినియం గ్లాస్, డోర్ ఫ్రేమ్ తయారీ పరిశ్రమలో ఉద్యోగాలు చేస్తున్నట్లు సమాచారం. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనం నడపడం వల్లే ప్రమాదం జరిగినట్లు దుబాయ్ పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఘటనపై సమాచారం అందుకున్న భారత కాన్సులేట్ అధికారులు ఆస్పత్రికి చేరుకుని బాధితులను పరామర్శించారు. మృతదేహాలను స్వదేశానికి తరలించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు తెలుస్తోంది.

# గోదావరిలో విషాదం..

**మొదటి పేజీ తరువాయి**

వెలికితీశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాచిగూడ చప్పల్ బజార్ ప్రాంతానికి చెందిన కుటుంబ సభ్యులు బాసరలోని జ్ఞాన సరస్వతి అమ్మవారి దర్శనం కోసం మంగళవారం ఉదయం వచ్చారు. దర్శనానికి ముందు గోదావరి నదిలో పుణ్యస్నానం చేస్తుండగా చంద్రశేఖర్(38), రామచందర్(36), మల్లేశ్ కుమార్(31) అనే ముగ్గురు సోదరులు ప్రమాదవశాత్తూ లోతైన ప్రాంతంలోకి వెళ్లి నీటిలో మునిగిపోయారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, రెస్క్యూ సిబ్బంది, గజ ఈతగాళ్లు సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు ప్రారంభించారు. పలుగంటల పాటు సాగిన శోధన అనంతరం ముగ్గురి మృతదేహాలను వెలికితీశారు. మృతులంతా సొంత అన్నదమ్ములేనని అధికారులు వెల్లడించారు.ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు యువకులు ఒకేసారి మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు విషాదంలో మునిగిపోయారు. బాసరతో పాటు హైదరాబాద్‌లోని కాచిగూడ ప్రాంతంలో కూడా ఈ ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. సంఘటన స్థలంలో కుటుంబ సభ్యుల రోదనలు హృదయ విదారకంగా మారాయి. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. గోదావరి నదిలో స్నానాలు చేసే సమయంలో భక్తులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, లోతైన ప్రాంతాలకు వెళ్లొద్దని పోలీసులు హెచ్చరించారు.

# సాటర్ డే.. నో బ్యాగ్ డే

## విద్యలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం

### క్రీడలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న నేపథ్యంలో.. క్యాలెండర్‌లోనే ప్రతిరోజూ క్రీడలు, ఆటలు.. విద్యార్థులకు యోగా లేదా ధ్యానం చేయించటం తప్పనిసరి



**దశ, వరంగల్ :** తెలంగాణలోని పాఠశాల విద్యలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతూ విద్యాశాఖ 202627 విద్యా సంవత్సరానికి సంబంధించిన అకడమిక్ క్యాలెండర్‌ను విడుదల చేసింది. ఈసారి కేవలం చదువుకే పరిమితం కాకుండా విద్యార్థుల మానసిక ఉల్లాసానికి, శారీరక దారుఢ్యానికి క్యాలెండర్‌లో పెద్దపీట వేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్రీడలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న నేపథ్యంలో.. క్యాలెండర్‌లోనే ప్రతిరోజూ క్రీడలు, ఆటలు నిర్వహించాలనే నిబంధనను విద్యాశాఖ పొందుపరిచింది.కొత్త నిబంధనల ప్రకారం.. పాఠశాలల్లో పిల్లలకు సాధారణ బోధనతో పాటు ప్రతిరోజూ క్రీడలు నిర్వహించాలి. విద్యార్థుల్లో పఠనాశక్తిని పెంచేందుకు కథల పుస్తకాలు, పత్రికలు, మ్యాగజైన్లు లాంటి వాటిని రోజుకు అరగంట పాటు చదివించాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. వీటితో పాటు, ప్రార్థన సమయంలో లేదా అది పూర్తయిన తర్వాత తరగతి గదిలో ఐదు నిమిషాల పాటు విద్యార్థులకు యోగా లేదా ధ్యానం చేయించటం తప్పనిసరి చేశారు.ఈ విద్యా సంవత్సరంలో పాఠశాలలు మొత్తం 227 రోజుల పాటు పనిచేస్తాయి. పదో తరగతి సిలబస్‌ను 2027 జనవరి 10వ తేదీ నాటికి, మిగిలిన తరగతులకు ఫిబ్రవరి 28 నాటికి పూర్తి చేయాలని అధికారులు గడువు విధించారు. వచ్చే ఏప్రిల్ 23వ తేదీ పాఠశాలలకు చివరి పనిదినంగా ఉంటుంది. వచ్చే సంవత్సరం ఏప్రిల్ 24 నుంచి జూన్ 13వ తేదీ వరకు (2027) వేసవి సెలవులు ఉంటాయి. 2027 మార్చి 15 నుంచి చివరి పనిదినం వరకు ఒంటిపూట బడులు నిర్వహిస్తారు. తొలిసారిగా ఈ ఒంటిపూట బడుల తేదీలను విద్యా క్యాలెండర్‌లోనే ముందుగా ప్రకటించడం విశేషం.ఇక ప్రతి నెలా మూడో శనివారం విద్యార్థులకు నో బ్యాగ్ డేగా అమలు చేస్తారు. అదే రోజున అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సమావేశాలు కూడా జరపాలి. 1 నుంచి 9వ తరగతి చదివే విద్యార్థులకు భోజన విరామం తర్వాత సెప్టెంబరు వరకు ప్రతిరోజూ ఒక సబ్జెక్టుపై ప్రత్యేకంగా రెమిడియల్ తరగతులు నిర్వహించాల్సి ఉంటుంది. దీనివల్ల చదువులో వెనుకబడిన విద్యార్థులు సబ్జెక్టులపై అవగాహన పెంచుకునే అవకాశం లభిస్తుంది. కాగా.. మే 14న ప్రారంభమైన బడిబాట కార్యక్రమాన్ని ఈ నెల 19 వరకు కొనసాగించాలని విద్యాశాఖ ఆదేశించింది. అలాగే.. గత ఏడాది స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను 6 నుంచి 7కు పెంచగా.. ఈసారి మళ్లీ వాటిని 6కు తగ్గించారు. ఈ సమావేశాలు జులై, ఆగస్టు, సెప్టెంబరు, నవంబరు, డిసెంబరు, ఫిబ్రవరి నెలల్లో జరుగుతాయి. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు వివిధ సైన్స్ ప్రదర్శనల షెడ్యూల్‌ను క్యాలెండర్‌లో చేర్చారు. రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శన 202526 జాతీయస్థాయి ఎగ్జిబిషన్‌ను అక్టోబరులో నిర్వహించనున్నారు. 202627 సంవత్సరానికి సంబంధించి జిల్లా స్థాయి పోటీలను నవంబరు లేదా డిసెంబరులో, రాష్ట్రస్థాయి పోటీలను డిసెంబరు లేదా జనవరిలో జరుపుతారు. సదరన్ ఇండియా సైన్స్ ఫెయిర్ 2027 జనవరిలో నిర్వహించనున్నారు.




# హెచ్-1బీ వీసాపై లక్ష డాలర్ల ఫీజుకు కోర్టు బ్రేక్..

## ట్రంప్ విధానంపై తీవ్ర విమర్శలు

**దశ, న్యూఢిల్లీ :** అమెరికాలో విదేశీ నిపుణుల నియామకాలకు సంబంధించి మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన భారీ ఫీజు విధానానికి గట్టి ఎదురుదెబ్బ తగిలినట్లు అంతర్జాతీయ మీడియాలో వార్తలు వెలువడుతున్నాయి. హెచ్1బీ వీసా ద్వారా విదేశీ ఉద్యోగులను నియమించుకునే అమెరికన్ కంపెనీలపై లక్ష డాలర్ల ప్రత్యేక రుసుము విధించే ప్రతిపాదనపై బోస్టన్ ఫెడరల్ కోర్ట్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. అమెరికాలో స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు పెంచాలనే ఉద్దేశంతో విదేశీ నిపుణుల నియామకాలపై అదనపు ఆర్థిక భారం మోపాలని ట్రంప్ ప్రభుత్వం గతంలో ఆలోచించినట్లు చెబుతున్నారు. ప్రత్యేక నైపుణ్యాలు కలిగిన విదేశీ ఉద్యోగులను నియమించుకునే సంస్థలు భారీ మొత్తంలో ఫీజు చెల్లించాలనే ప్రతిపాదనపై అప్పట్లోనే పెద్ద ఎత్తున వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ వ్యవహారంపై పలువురు రాష్ట్రాల అటార్నీ జనరల్స్ కోర్టును ఆశ్రయించగా.. విచారణ చేపట్టిన యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి లియో సోరోకిన్ కీలక వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ ఆమోదం లేకుండా ఇలాంటి భారీ రుసుములు విధించడం చట్టబద్ధం కాదని కోర్టు అభిప్రాయపడినట్లు సమాచారం. ప్రత్యేకంగా కళాశాలలు, ఆస్పత్రులు వంటి ప్రభుత్వ అనుబంధ సంస్థలకు ఈ విధానం తీవ్ర భారం అయ్యేదని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదించారు. లక్ష డాలర్ల ఫీజు కారణంగా ప్రతిభావంతులైన విదేశీ నిపుణులను నియమించుకోవడం కష్టమవుతుందని వారు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ అంశంపై కోర్టు స్పందనతో ట్రంప్ ప్రతిపాదించిన విధానానికి గట్టి ఎదురుదెబ్బ తగిలిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అమెరికా వలస విధానాలు, విదేశీ నిపుణుల నియామకాల అంశం మరోసారి చర్చనీయాంశంగా మారింది.

Printed, Published and Owned by B.KALPANA and Printed at Kalpana Publications , Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505, and Published at Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505. Editor: B.KALPANA. PRGI.No.TGTEL/25/A4195. Cell 9848288850, namasteshekar@gmail.com